షాక్ అండ్ షాక్

వేదుల మీనాక్షీదేవి

““పోస్టువాడు వెళ్ళిపోయాడా, శేషూ!”

“ఏమోనమ్మా. అయినా నీ చాదస్తం గాని! మనకి వుత్తరం వస్తే వచ్చి యివ్వడూ?”

“ఏమిటోరా. నా ఆదుర్దాకొద్దీ అలాగ అంటానంతే. అన్నయ్య దగ్గిర నుండి ఉత్తరం వచ్చి పదిహేను రోజులైంది.”

“ఉత్తరం వ్రాస్తే యెందుకు రాదూ? వాడు వ్రాయలేదన్నమాట. అంతే.”

“అంతే అని అంత తేలికగా అనేశావు గాని వుత్తరం వ్రాయకపోతే యెవళ్ళెలాగ వున్నారో అనిపిస్తూంటుంది. అన్నయ్య ఒక్కడూ వున్నాడు. కాస్త తల నొప్పి వస్తే, పరాయివూళ్ళో వాడిని చూసేవాళ్ళెవరున్నారు చెప్పు. అందుకే మరీ బెంగ వాడి గురించి.”

“నీ బెంగకి అర్థం పర్థం లేకుండా పోతోంది. అన్నయ్యకి ఆఫీసు పనులవల్ల తీరికలేకపోతోందని చెప్పాడు యెన్నోసార్లు, “అయ్యో. నేను వ్రాయడం ఆలస్యమైపోయింది” అంటూ వ్రాస్తూంటాడు కూడాను.”

"సినిమాలకైతే కావలసినంతతీరుబడి. 'క్షేమం' అని రెండు ముక్కలు వ్రాసి పడెయ్యడానికి తీరికలేదూ?''

''వాడిని అంటావుగాని అక్కయ్యలు సరిగ్గా వ్రాస్తున్నారా?''

''అక్కయ్యలు అత్తవారింట్లోవున్న వాళ్ళాయె. చటుక్కున వ్రాయదానికీ, వెంటనే పోస్టు చెయ్యడానికీ వీలుపడక పోవచ్చు. వీడికె అలాంటి యిబ్బంది లేదు కదూ? అక్కడికే నేను ఖంగారు పడతా నని ఆడపిల్లలు తరచు వ్రాస్తూనే వుంటారు.''

''ఎప్పుడూ వాళ్ళందరి గొడవే సరి పోతుంది. ఇంట్లోవున్న నా గొడవ ఏమీ పట్టదు మీకు.''

''అదేమిట్రా, శేషూ! నీ కేమి లోపం జరిగిందిరా, బాబూ! పిల్లలు కళ్ళయెదుట మసలుతూంటే ఆ తల్లిదండ్రులకు అంత కన్న ఆనందం వుంటుదిరా, పిచ్చి తండ్రీ."

''ఎంతసేపూ ఎదుట వుండాలి, ఎదుట వుండాలి అంటావు. ఎల్లకాలం మీరు మా మీద డామినేట్ చేస్తూ, మీ అదుపాజ్ఞలలో వుండాలనుకుంటున్నారు. మేమూ పెద్ద వాళ్ళమౌతున్నాం, మాకూ ప్రాజ్ఞత తెలి సింది. మా భావాలూ, ఆశయాలూ మాకు వుంటాయి. మా విషయాలలో వీలైనంత మట్టుకు కలుగజేసుకోడం తగ్గించుకోవాలి. మాటకి చెబుతున్నాను, రేపు ఏ ఉద్యోగ మైనా వస్తే నేనూ వెళ్ళిపోవాలి. బైట ప్రపంచంలో మసలుకోవాలి కదా."

''అప్పుడు నీ కోసం బెంగపెట్టు కుంటాను. నీ ఉత్తరానికీ ఎదురు చూస్తూం టాను.''

''అదే కూడదంటున్నాను. బెంగ అనవసరం. ఉత్తరం రానంతసేపూ క్షేమంగా వున్నారనుకుంటే ఎంతహాయి!"

''ఇప్పుడు తెలియదురా ఆ బెంగ అంటే యేమిటో ఒక్క నలుసు బైలు దేరాలి. అప్పుడర్థమౌతుంది. చూస్తున్నా వుగా, అక్కయ్యలు వాళ్ళ పిల్లలకు నేను నీళ్ళు పోస్తుంటే, ''అమ్మా గట్టిగారుద్దకు నొప్పెడుతుంది. నీళ్లు యెక్కువ వేడిగా పొయ్యకు అంటారు. మీ అందరికీ కళ్లు సరిగా తెరవనప్పటి నుండీ నేను నీళ్ళు పొయ్యలేదా? పెంచలేదా? వాళ్ళలాగ అంటున్నారని కోపగించుకుంటున్నానా? దాని ప్రేమ దానిది అనుకుంటాను. నవ్వు కుంటానంతే. అలాగే నీకూను."

''నా కలాంటి బెంగ ఏమీ వుండదు'' అన్నాడు శేషు.

''అదీ చూద్దాం, ఈ కంటి కీ రెప్పలు దూరంకాదు,'' అంది తల్లి.

ఇంతలో పోస్టువాడు వచ్చి ఓ బుక్ పోస్టు యిచ్చి వెళ్ళాడు.

అమ్మా. యివాళ ఉత్తరాలు యేవీ రా లేదమ్మా, నాన్నగారికి భవాన్స్ జర్నలు మాత్రం వచ్చింది. మహాగ్రంథం.''

నాన్న గదిలో వున్నట్టున్నారు. ఇచ్చి రా," అంది తల్లి పార్వతి.

"ఇవ్వాళా రాలేమూ ఉత్తరం అబ్బాయి దగ్గిర్నించి," స్వగతంగా పైకి అనుకుని, అక్కడే వసారా గుమ్మంలో కూర్చుండి పోయింది ఆలోచిస్తూ.

గదిలో నుండి శేషు, తండ్రి మాట్లాడు కుంటున్న మాటలు గట్టిగా వినబడు తున్నాయి.

"పోనీలేరా. నిన్ను చదవమన లేదు కదూ? ఎవరికి తగ్గ పుస్తకాలు వాళ్ళకి వుంటున్నాయి. ఈ పుస్తకంలో ఈ ఉపని షత్తుల గురించి, గొప్ప గొప్పగా వేదాం తులు, వాటినిగురించి స్టడీచేసిన విద్యాంవం తులు యిందులో వ్రాస్తూంటారు. వాటిని చదువుతున్నంత సేపూ ఐహికమైన విషయాలేవీ గుర్తుకిరావు. మనస్సు ఎంతో ప్రశాంతంగా వున్నట్లనిపిస్తుంది. ఈ వయస్సులో యింతకన్న కోరుకునేదీ, కోరుకోవలసిందీ ఏముంది చెప్పు."

"వీటితోనే వేదాంతం వస్తే ఏనాడో ఆపాఠకులంతాయోగులయేవారే. నాన్సెన్స్. వట్టిడబ్బు దండుగ. ఏ బుక్ పోస్టైనా పోతుందిగాని, యీ పత్రికమాత్రం టారి స్టరు పార్వతీశం టోపీలాగ వచ్చేస్తుంది ప్రతీనెలా!" ఆక్షేపణ ధ్వనిస్తోంది శేషు గొంతులో.

"ఇంగ్లీషువీ, తెలుగువీ మీరు కొనే పత్రికలు, నవలలూ ఎన్నెన్ని కొంటు న్నారో లెక్కా పత్రంవుందా? వాటికి యెంత ఖర్చవుపోంతో నెల నెలా ఆలో చించావా యెప్పుడైనా? వాటికి డబ్బిస్తున్న వాడిని నేనేకదూ? ఎప్పుడైనా మిమ్మల్ని వద్దన్నానా? పోనీలే. కుర్రవాళ్ళు చదువు కుంటారు. ఎప్పుడూ స్టడీస్‌తో సతమత మౌతూంటారు. కాస్త యిటువంటివి మధ్య మధ్య చదువుతే కాస్త మనస్సుకి "రిలీఫ్‌గా వుంటుందని నా అభిప్రాయం. నేను ఒక్క పత్రిక తెప్పించుకుంటుంటే యింతకంఠ శోషపడుతున్నావు గానీ!" ఆయన గొంతు.

"సరే. అయితే యిక యిలాంటివి యివ్వాళ మొదలు కొనడం మానేస్తానులే. ఇంతకీ నేను నిరుద్యోగిని కనుక యిల్లాగ మాట్లాడు తున్నారు మీరు. మీ ముద్దుల చిన్నకూతురు కొనే పుస్తకాలకు హద్దు వుందా? ఎప్పుడైనా దాని నేమైనా అన్నారా?"

విసవిసా గదిలోంచి యివతలకి వచ్చి తనగదికి వెళ్ళిపోయాడు శేషు. అతని ముఖం జేవురించి వుంది.

ఆ తండ్రీ కొడుకుల సంభాషణ యింతసేపూ వినబడుతూనే వుంది పార్వ తమ్మకు.

పిల్లవాడు తండ్రిని అన్నమాటలకు ఆమె విలవిల్లాడింది.

భర్త ఏం బాధ పడుతున్నాడో!

మెల్లిగాలేచి గదిలోకి వెళ్ళింది పార్వ తమ్మ.

ఆమె భర్త రామనాథం న్యూస్ పేపరు చూసుకొంటున్నాడు.

దగరగా వెళ్ళి నిలబడింది.

"ఏమండీ, బాధ పడకండి. వాళ్ళ అవసరాలు న్యాయంగాను, మన అవసరాలు అన్యాయంగాను కనబడు తున్నాయి వాడికి. ఇంతకీ ఖర్చు పెట్టేది మీరే! వాళ్ళ సంపాదనలో డబ్బు జాగ్రత్త తెలిసి వచ్చి యిటువంటి ఖర్చు లేవీ చెయ్యనే చెయ్యరు. ఏమీ కొనరు. వీళ్ళ అభిప్రాయం మీ కనవసరం. మీకు కావలసినవి నిక్షేపంలాగ కొనుక్కోండి వీళ్లా మీకు చెప్పేవారు?

చదువుకున్న వాళ్ళకు విజ్ఞానం బాగా వుంటుందనుకున్నా నిన్నాళ్ళూ. విద్యవేరు, విజ్ఞానంవేరు. విద్యలేకపోయినా ఎంతో విజ్ఞానం, సంస్కారం కలవాళ్లుంటారని పిస్తోంది యిప్పుడు."

సానునయంగా అన్నది ఆమె.

పేపరునుండి తలయెత్తి చూశాడు రామనాథం.

"ఆఁ! అన్నట్టు పార్వతీ ఈ నెల మన చిన్నమ్మాయి అరుణ పుట్టినరోజు కదూ? దానికి కొత్తబట్టలు కొనవూ?" అన్నాడు.

శేషు అంత లేసిమాటలన్నా ఈయన కించిత్తుకూడా బాధపడ్డం లేదా!

ఏమిటీ వ్యక్తి! . ఒకవేళ తను బాధ పడుతుందని ఆయన ఆవేదన పైకి తెలియనియ్యడం లేదా?

నిర్విణ్ణు రాలైంది పార్వతమ్మ.

* *

"రండమ్మా, రండి చాలా రోజు లైంది మా షాపులోకి వచ్చి, ఇలా కూర్చోండి," అని బల్ల చూపించాడు షాపు యజమాని.

"మరేనయ్యా, కొనడం అంటూ వస్తే మీ షాపులోనే కదా కొనేది," నవ్వుతూ అంది పార్వతమ్మ.

"ఏం చీరలు తియ్యమన్నారమ్మా?" అన్నాడతడు. "ఏవైనా కొత్త చీరలు వస్తే చూపించు," అంది ఆమె.

"మీరు కట్టుకునే చీరలలో రకరకాల కొత్తచీరలు వచ్చాయి. గుంటూరు, పేటేరు, వెంకటగిరి, ధర్మవరం . ఇంకా యింకా చాలా వున్నాయి చూద్దురు గాని," అన్నాడు షాపువాడు.

"నా బట్టలకేం గాని యీ అమ్మాయికి పనికి వచ్చే ఫేషన్‌లో చీరలు చూపించు," అంది ఆమె.

అన్నదే తడవుగా బండెడు చీరలు తెచ్చి వాళ్ళముందు పడేశారు షాపులోని పనివాళ్ళు.

"ఇవి టెర్లిన్,. .ఇవి నైలాన్,. . . ఇవి నైలెక్స్,. .ఇవి టెరీకాట్, ...ఇవి

షెరీ వాయిల్, ఇవి సెల్ఫ్ ప్రింట్ ఇవి ఫారన్ నైలెక్స్, ఇవి ఎల్సార్... ఇవి కాలీసింధే, '' చెప్పుకొని పోతు న్నాడు గబ గబా, గుక్క తిప్పుకోకుండా షాపు యజమాని'

అరుణ ఒక్కొక్క చీరతీసి అటు తిప్పి, యిటు తిప్పి, పెదవి విరిచి పక్కను పడేస్తోంది.

''ఈ అంచులోనే యింకా కలర్సు వున్నాయా?. ఈ రంగులో ఆ పైటంచు రకం వున్నవి వున్నాయా? చీరకలరుకి ప్రింటు సూటయిందికాని, అలుక్కు పోయి నట్లుంది మొత్తం ప్రింటు .ఆ ప్రింటు మ యెడంగావుంది... ఫారన్ నైలెక్స్ రామరామ తడి తగిలితే మోకాళ్ళ మిదకిపోతుంది...'' ఈ విధంగా అన్ని చీరలకు ఇదే వరస!

యక్ష ప్రశ్నలవంటివి లక్ష ప్రశ్నల వర్షం కురిపించింది అరుణ.

షాపువాడు ఆ అమ్మాయి వేస్తున్న ప్రశ్నలన్నిటికీ ఏదో సమాధానం చెబు తున్నాడు ఓపిగ్గా.

అంతసేపూ క్రింది పెదవిమీదికి ఎత్త లేదు పార్వతమ్మ.

కూతురు వేస్తున్న ప్రశ్నలను, షాపు వాని సమాధానాలనూ వింటూ బొమ్మలాగ

కూర్చుండి పోయింది....ఆఖరికి విసుగు అనిపించిందామెకు.

"ఇన్ని చీరలు చూశావు. ఇంచుమించు షాపులోని చీరలన్నీ నీ యెదుట ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కచీరా నచ్చలేదా అరుణా? చాలామంది ఇటీవల కట్టుకుంటున్నారు, ఆ చీర చూడు. నీ యెడం చేతివైపు దొంతరలో క్రిందనుండి అయిదవ చీర... ఆ లేతరంగుమీద బోర్డరు చాలా బాగుంది. నువ్వు కట్టుకుంటే చాలా నప్పుతుంది..." అంది తల్లి.

తల్లివైపు కొరకొర చూసింది అరుణ సీరియస్‌గా ముఖం పెట్టి.

"అలాగ గట్టిగా మాట్లాడకు. షాపులో అందరూ వింటారు."

పళ్ళు బిగించి, పెదిమెలు కదపకుండా సణిగినట్లంది అరుణ.

ఇక ఆ అమ్మాయి చీరల ప్రసక్తికి పోలేదు పార్వతమ్మ.

తనకామాత్రం మర్యాద తెలియదా... తనచేతి మీద కొన్ని వేల రూపాయలు విలువైన చీరలు కొంది! అరుణ కట్టుకుంటున్న బట్టలు తను సెలెక్టు చేసినవి కావా? తోటి విద్యార్థినులంతా ముచ్చట పడతారే దాని చీరలు చూసి! ...తనది మంచి సెలెక్షను అంటారే పిల్లలంతా. ఏమిటీ నాడు ఈ వైపరీత్యం? ...

ఏవేవో ఆలోచనలతో పరధ్యాన్నంగా కూర్చుండి పోయింది పార్వతమ్మ.

"అమ్మగారూ....మీ చీరలు చూపించమన్నారా?" అన్నాడు షాపువాడు.

"వద్దులే. అమ్మాయిలు పండగకి వస్తారు. అప్పుడు తీసుకుంటాలే," అంది ఆమె.

"పండగవరకూ యీ కొత్త సరుకు ఆగదండి. ఎగరేసుకుని పోతారు మీకు నచ్చినవి పట్టుకువెళ్ళండమ్మా," అన్నాడు వాడు.

పార్వతమ్మ లేచి ఆ బీరువాల దగ్గరకు వెళ్ళి చీరలు చూసింది. చీరలన్నీ చాలా బాగున్నాయి .కాని పెద్ద అమ్మాయిలు వచ్చాక వాళ్ళకి నచ్చినవి కొనవచ్చు ..

తువ్వాళ్ళూ, దుప్పట్లు చూపించమంది.

కన్ను చెదిరేలాగ రకరకాల తువ్వాళ్లు, దుప్పట్లు చూపించారు షాపులోని కుర్ర వాళ్ళు. వాటిలో నాలుగు తువ్వాళ్ళు, నాలుగు దుప్పట్లు ఎంచి తీసుకుంది ఆమె... సొమ్ము యిచ్చేసింది....

ఇదంతా అయేసరికి అరుణ లేచింది.

"నాకు కావలసిన రకం లేవు. మరో షాపులో ఉన్నాయేమో చూసి వస్తాం. ఈ అరడజను చీరలూ ఒకచోట ఉంచండి," అంది అరుణ కొన్ని చీరలు చూపించి.

తెల్లబోయింది తల్లి.

"ఎంతో బాగున్నాయి చీరలు. ఒక్కటీ నచ్చలేదా?" అంది షాపులోంచి బైటకు వస్తూ ఆమె.

- ఈ మూడు మందులూ చెరొక అరఔన్సు, సోడా 5 ఔన్సులు, చక్కెర ఒకగ్రాము, గ్లూకోజు అరగ్రాము, ఆటానిక్ 5cc లు – ఖచ్చితంగా ఈ కొలతల ప్రకారం మూడుపూటలా మీరే స్వయంగా కలుపుకొని తాగండి రెణ్ణెళ్ల పాటు - తర్వాత రండి!



ఇంట్లో ఉండే నీకు యేం తెలుస్తుంది ఫ్యాషన్? బైటకు వెళ్ళి చూడు, తెలుస్తుంది. ఇలాంటి చీరలు కట్టుకుంటే మా కాలేజీ విద్యార్థినులు, చాటుగా కాదు, ముఖంమీదే నవ్వేస్తారు, తెలుసా?" అంది మెల్లిగా అరుణ.

అంటూ ఇటూ అటూ చూసింది, ఎవరైనా తన మాటలు వింటున్నారేమోనని!

"అమ్మాయిగారు చెప్పిన చీరలు బల్లమీద ఉంచమన్నారా:" షాపులోని కుర్రవాని గొంతు.

"వెర్రిముఖమా! అలాగ అంటే అక్కర్లేదన్న మాట. బీరువాలలో సర్దేసెయ్యి," యజమాని గొంతు.

తల్లీ కూతుళ్ళ చెవిని పడ్డాయి.

పార్వతమ్మకు చాలా చిన్న తన మనిపించింది.

ఆఁ పోదూ....వీళ్ళ మాటలు కాతరు చేసేవాళ్ళెవరు? తుక్కులాంటి గుడ్డలు తెప్పించి కొనమంటే యెవరు కొంటారు? వూరు గొడ్డుపోలేదు," అంటూ విసురుగా మరో షాపులోకి దారితీసింది అరుణ.

"నా చీరకోసం వచ్చి మరో బేరం చెయ్యడం యేమిటి? కావలిస్తే మళ్ళీ రాకూడదా మరొక రోజున? కొనుక్కోకూడదా? నాతో వచ్చినప్పు డికముందు యెప్పుడూ అలాగ చెయ్యకు," గట్టిగా మందలించిది తల్లిని అరుణ.

దుప్పట్లు, తువ్వాళ్ళు ఆమెకొన్నదన్న కోపంతో.

అంత అవసరం కాకపోయినా కుమార్తె వరసచూస్తే ఏమీ కొనేటట్లు కనబడ్డంలేదు. ఇంతసేపు చూసి ఏమీ కొనకుండా వెళ్ళడానికి ఆమెకు మనస్కరించ

లేదు. అందువల్ల తీసుకుంది వాటిని పార్వతమ్మ.

నాలుగు షాపులు తిరగవేయించి, చివరకు ఒక చీర తీసుకుంది అరుణ.

ఇంటికి వచ్చేటప్పుడు కూడా పార్వతమ్మ ఏమీ మాట్లాడ లేదు.

అరుణ గంభీర ముద్ర దాల్చింది.

మద్యాహ్నం రెండు గంటలకు వెళ్ళిన వాళ్లు సాయంత్రం ఆరున్నరకు యింటికి చేరుకున్నారు.

పార్వతమ్మ కోసం పని మనిషి కని పెట్టుకుని కూర్చుంది .. వంటచేసుకోవాలి .పనిలో మునిగి పోయింది వచ్చిందే తడవుగా పార్వతమ్మ.

*　　*

"అమ్మా, అరుణా! నువ్వు కొనుక్కున్న చీర ఏదీ చూపించు. అన్నాడు రామనాధం భోజనం అయి తీరికగా పడక కుర్చీలో కూర్చుని.

అరుణ యిచ్చిన ప్యాకెట్ విప్పి చూశాడు.

"నీకు నచ్చిందా? మీ అమ్మ సెలెక్షనా? మీ అమ్మ బలవంతపెట్టి కొనిపించలేదు కదా?" అన్నాడాయన.

"ఆఁ. అనుకుంటూనే ఉన్నాను, అప్పుడే చెప్పేసిందన్నమాట! నేను చీరలు తీసుకుంటూంటే తను తువ్వాళ్లు, దుప్పట్లు బేరం, అక్కడ బీరువాలోని చీరలు బీరువాల దగ్గిర నిలబడిచూడ్డం, ఎంత ఇన్సల్ట్? కావాలంటే వాళ్లు తెచ్చిగుట్టుగాపడేస్తారే: మర్యాద తెలియని వాళ్ళలాగ అక్కడికి వెళ్ళి చూస్తున్నారనుకోరూ యెవరైనాను? .పైగా అన్ని చీరలు తీయించావు. ఒక్కటీనచ్చలేదా?" అని తోమేసిందను కో నన్ను. చీరలు తీయిస్తేమాత్రం మనకి నచ్చడం అంటూ వుందారేదా చెప్పండి, నాన్నా మీరేను. తెల్లవారింది మొదలు షాపులలో వాళ్ళకి వాళ్ళ సరుకులు చూపించడమేకదాపని? వాళ్ళమీద జాలి యెందుకు? మొగమాటం యెందుకు? ఏమన్నా గట్టిగా అంటే 1950 సం, లో పెద్దక్క పెళ్ళికి అవి కొన్నాను, 1954 లో నీ బారసాలకి యివి కొన్నాను ఇద్దరు అక్కయ్యల అత్తవారు నా బట్టల సెలెక్షనుకి యెంతో మెచ్చుకున్నారు. ఊఁ ముచ్చటపడి పోయారు వాళ్ళకి పెట్టిన బట్టలుచూసి, "అన్నిప్రారంభిస్తుంది. ఇక ఎన్నడూ అమ్మతో బజారుకి వెళ్ళ కూడదు."

ఖచ్చితంగా చెప్పేసింది అరుణ.

"నువ్వు యింతదండకం చదివావు, గాని, మీ అమ్మనాతో ఏమీచెప్పలేదమ్మా. నా మాట నమ్ము. మీ అమ్మ సెలెక్షను బాగుంటుందని మీరంతా అంటూంటారని వేళాకోళానికి అన్నానమ్మా'" అన్నాడు తండ్రి నవ్వుతూ.

"వట్టిదేనే, అమ్మ నాన్నతో చెప్పే ఉంటుంది. అందుకే నాన్న నిన్ను అడి

గారు. ఇంక కాస్తసేపటికి అమ్మవచ్చి ఏమిటే అరుణా నాన్నాతో అన్నావుట?" అని అడుగుతుంది. దానితో సర్కిల్ పూర్తవుతుంది. వెర్రిదానా, నాన్నతో చెబితే ఉత్తర క్షణంలో అమ్మకి తెలుస్తుంది. అమ్మకి తెలిసినా అంతే!" అన్నాడు పకపకా నవ్వుతూ శేషు.

రామనాథం ఏమీ సమాధానం చెప్పలేదు.

పనులన్నీ పూర్తి చేసుకుని అప్పుడే అక్కడికి వచ్చిన పార్వతమ్మ శేషు మాటలువిని నిర్ఘాంత పోయింది.

* *

పండగకు దూరానవున్న కొడుకు శేఖరం, అత్తవారింటో వున్న యిద్దరు ఆడపిలలు, మనుమలు వచ్చారు. పార్వతమ్మకు వూపిరి సలపడం లేదు. వంటవాళ్ళని ఏర్పాటు చేస్తే వాళ్ళు ఏదో డ్యూటీగా చేసేస్తారు గాని యింట్లోవాళ్ళు సుఖించి తినాలి అన్న ఆకాంక్ష వాళ్ళకి వుండదు. అందువల్ల కష్టమైనా తనే చేసి పెటాలి బిడ్డలకు అని ఆమె వుద్దేశం.

"అబ్బాయీ, శేఖరం! నీకు యిష్టమని పచ్చిటొమాటో, వుల్లిపాయకూర చేశాను. నూపప్పు వేయించి పొడుం కొట్టాను. లేత కొబ్బరి పెరుగు పచ్చడి చేశాను." అంటూ పార్వతమ్మ పీట వేసుకుని యెదురుగా కూర్చుని, ఆపేక్షగా వడ్డించి, తినమని బలవంతం చేస్తోంది కొడుకును.

"వద్దమ్మా, అభిరుచులతో బాటే రుచులూ మారుతూంటాయి వయస్సు పెరిగినకొద్దీ," అన్నాడు శేఖరం. కూర కంచంలోంచి క్రిందకు తోసేశాడు. నూపొడుం, కొబ్బరిపచ్చడి వేలుతోతాకి, పెరుగు పోసేసుకున్నాడు.

తెల్లబోయి చూస్తూ వుండిపోయింది ఆ తల్లి.

"ఏ బిడ్డకి యిష్టమైనవి ఆ బిడ్డకి చేసి పెడితే తల్లికి తృప్తి. ఆ సంగతి బిడ్డకు తెలియదు.... తెలుసుకునేందుకు ప్రయత్నించనైనా ప్రయత్నించరు కదా," అనుకుంది పార్వతమ్మ.

ఆమె మనస్సుకి గట్టి దెబ్బతగిలినట్లైంది.

వట్టి పెరుగుఅన్నంతిని పిల్లవాడు వెళ్ళిపోతే ఆమెలోని పేగులు చుట్టుకుపోయినట్లు బాధపడింది.

"ఏదీ పనికిరాకపోతే ఎలాగ? పోనీ నీకు కొత్తగా ఏది యిష్టమైతే అదే చేస్తానురా," అని ప్రాధేయపడింది.

"అమ్మా, నీ చాదస్తం చూస్తే నవ్వొస్తోంది. ఈ రెండు రోజులూ నువ్వేతే చేసిపెడతావనుకో, జన్మంతా హోటలు బ్రతుకే కదా! ఆవేళ కేది విస్తరిలోకి వస్తే దానితో సరిపెట్టుకోవాలి... ఆ విధంగా అలవాటు పడ్డం

మంచిది. అందుకే నువ్వు వడ్డించినవన్నీ రుచి చూడకుండా వదలలేదు. కాస్తో, కూస్తో తిన్నానుగా,'' అన్నాడు కొడుకు.

ఇంకేం మాట్లాడగల దామె!

సాయంత్రం కూతుళ్ళను, మనుమలను తీసుకుని సినీమాకు వెళ్ళింది పార్వతమ్మ. తన కుమార్తెలను పిల్లలు సరిగా చూడనివ్వరని వాళ్ళ సదుపాయం కోసం వెళ్ళిందామె. ఆమెకు యిరువైపులా, మనుమలు కూర్చున్నారు.

సినీమాపూర్తయి యింటికి వచ్చేసరికి పదిన్నర అయింది.

"పిల్లలునిద్రపోలేదుటే, అమ్మాయీ'' అని పెద్దకూతురు విశాలను అడిగారు రామనాధం.

''మామూలుగా అయితే నిద్రపోయే వారేగాని, నాన్నా, వాళ్ళ అమ్మమ్మ తెర మీద విలన్ వచ్చేసరికల్లా, ''ఏంభయం లేదు. వూరికేనే అలాకత్తి ఒకసారి, తుపాకీ వొకసారి పట్టుకుంటాడంతే. అవైనా అట్టవేగాని నిజంవి కావు? అని ధైర్యం చెబుతూంటే వీళ్ళకేకాదు. హాల్లో యెవరికీ కూడా భయం లేకుండా పోయిందంటే నమ్ము!'' అని గలగలా నవ్వేసింది పెద్దమ్మాయి. మిగిలినవారు ఆమెతో శృతి కలిపారు.

వాళ్ళని చూడ నివ్వరనికదా తనుకూడా వెళ్ళింది! అంతేగాని తనకు తీరిక ఉండి కాదు, ఒపికాలేదు. అంతసేపు కూర్చుంటే నడుం నొప్పి బైటవేస్తుంది తనకి ... వాళ్ళ దృష్టిలో తను అంత మేనర్స్ తెలియనిదా! వాళ్ళ చిన్నప్పుడూ సినీమాలో వాళ్ళు భయపడి బిక్కముఖాలు వేస్తే సరదాగా కబుర్లు చెప్పలేదాతను!

మనస్సు చివుక్కుమంది ఆమెకు.

నాలుగు రోజులు ఉంటాడనుకున్న శేఖరం ఒక్క రోజు ఉండి, సెలవు లేదంటూ వెళ్ళిపోయాడు. వెడుతూ వెడుతూ రెండు వందలు తండ్రి నడిగి తీసుకొని మరీ వెళ్లాడు! ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్క వ్యక్తికి ఖర్చెంత అవుతుంది? వచ్చిన జీతం అంతా ఏమైపోతోంది! .ఏమిటి అనడం?... ఎలాగ అడగడం అడిగితే నిష్ఠూరం తప్ప కించిత్తు ప్రయోజనం శూన్యం

నోరు మెదపలేదు తండ్రి రామనాధం.

పండుగ లయాక కూతుళ్లు, అల్లుళ్లు, మనుమలు ప్రయాణాలయ్యారు. కూతుళ్ళిద్దరూ వెడుతూ వెడుతూ, ''అమ్మా, నీ కొక్క విషయం చెబుతాం. ఏమీ అనుకోకు, ఈ మధ్య నీకు విసుగెక్కువై పోయింది. నీకు చెప్పవలసిన వాళ్ళం కామనుకో, మేము మాత్రం పిల్లలతో చేసుకోడం లేదా? అస్తమానం పనివాళ్ళమీద, పాలవాళ్ళ మీద, కూరలవాళ్ళమీద కేకలు వేస్తున్నావు. ఎదురుతిరిగి వాళ్లేమైనాఅంటే మనకి అవమానం కాదా . .శాంతంగా ఉంటే నీ ఆరోగ్యానికి మంచిదే!'' అని సలహాయిచ్చి మరీ రిక్షాలు యెక్కారు.



"అరుణ మళ్ళీ సరిగ్గా అమ్మలాగ తయారౌతోంది," అన్నాడు శేషు.

పార్వతమ్మ విభ్రాంతి చెందింది.

ఆమె తల తిరిగి పోతోంది.

సుమారు నలభై సంవత్సరాలనుండి సంసార బాధ్యత వహించింది తను. గృహిణీ ధర్మ నిర్వాహణలో ఏ కించిత్తు లోపం రానియడం సహించలేదే! బిడ్డలను, చిన్నప్పటినుండి ఆదర్శవంతంగా పెంచాలని చక్కని భావాలు వారిలో పెంపొందింప జేయాలనీ భావించి వాళ్ళ పెంపకంలో యెంతో శ్రద్ధతీసుకున్నదే తను! అటువంటి తను యిప్పుడు కన్న బిడ్డలదృష్టిలో అసమర్థురాలు, పేచీకోరు! ఎన్నడో బి. సి. లో పుట్టవలసిన వ్యక్తిగా కనబడుతోందా తను.

ఇన్నాళ్లుగా శ్రమపడి, తన ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న దానికి యిదా చివరకు తనకు దక్కింది!

ఇన్నాళ్ళ సంసారంలో. పనివాళ్ళు పనులు చెయ్యలేదా? ఇంటిపనులకు, పై పనులకు పనివాళ్ళను పెట్టి పిల్లలకు ఏ లోటూ రానియ్యకుండా చేయించలేదా! వాళ్ళంతట వాళ్ళు మానుకోవలసిందేగాని ఏ ఒక్కరూ తన కారణంగా మానలేదే! పైగా, "మీ యిల్లు లాంటిది దొరకదమ్మా, పనివాళ్ళ కష్టసుఖాలు కనుక్కుంటారు. చూసీ చూడక యింత తిండికి పడేస్తారు. అడగకుండా నెల అయేసరికి మాకివ్వవలసిన డబ్బు ఇచ్చేస్తారు!" అంటారే గాని ఎన్నడూ తన గురించి మరొక విధంగా అనడం వినలేదే!

పిల్లలు పెద్దవాళ్ళయారు. ఇకమీదట నిశ్చింతగా కాలక్షేపం చేయవచ్చును జీవిత శేషం అనుకుంది తను.

కాలం యెలాగైనా గడిచిపోతుంది. ఎవరికోసం, ఎందుకోసం ఆగదు. కాని, తాను ఆశించిన నిశ్చింతకి బదులుగా తీరని

నిరాశ, నిస్పృహ, ఆవేదన, అవమానం హృదయాన్ని ఆక్రమించు కొన్నాయి

"అలాగ నిలబడి ఎంతసేపు చూస్తావు వాళ్ళని? రిక్షాలు వీధి మళ్ళిపోయాయి, ఈ పాటికి స్టేషన్‌కి కూడా వెళ్ళి ఉంటారు. రా లోపలికి," అన్న రామనాథం పిలుపుతో ప్రకృతావస్థకు వచ్చింది పార్వతమ్మ.

ఇంట్లోకి వచ్చింది.

ఆయన ఆమె ముఖం చూశారు.

ఆమె ముఖం జేవురించి ఉంది. మనిషిని నిలువునా వణికిపోతోంది వర్షించడానికి సిద్ధంగా ఉన్న నీటి మేఘాల్లాగ ఉన్నాయి ఆమె నేత్రాలు,

ఏమండీ. నేను ఔట్ ఆఫ్ డౌట్ అయిపోయాను," అంది. ఆమె కంఠం రుద్ధమైంది. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"నేనూ అంతే. పార్వతీ!" అన్నారాయన అమె కన్నీరు తుడుస్తూ.